క్లుప్తంగా

ట్రాఫిక్ ఇక్కట్లు



బుచ్చినాయుడుకండ్రిగ: ట్రాఫిక్ కారణంగా మెయిన్‌రోడ్డులో ఆగిన వాహనాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రమైన బుచ్చినాయుడుకండ్రిగ మెయిన్‌రోడ్డులో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో మండల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు పట్టించుకోకపోవడంతో వాహనాలు బారులు తీరుతున్నాయి. రోడ్డుకు అడ్డంగా ఆటోవాలాలు ఉంచడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మెయిన్‌రోడ్డులో ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈ సమయంలో ట్రాఫిక్‌లో చిక్కుకుని వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

అంకాళమ్మ పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆర్.అనంతాపురం గ్రామంలోని శ్రీ అంకాళమ్మ పరమేశ్వరి దేవతకు ఆదివారం గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. శ్రీ అంకాళమ్మ పరమేశ్వరి దేవతకు విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించి, పూజలు చేశారు. అనంతరం పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణి గ్రామంలో అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పిల్లలు, బాలింతలు, గర్భిణులు, భయాందోళనకు గురవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గర్భిణులు 19 మంది, బాలింతలు ఆరుగురు, పిల్లలు 27 మంది ఉన్నారు. ఈ భవనాన్ని నిర్మించి 30 ఏళ్లు కావొస్తుంది. ఇప్పటి వరకు భవనానికి ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో స్లాబ్, గోడలు దెబ్బతిని కూలడానికి సిద్ధంగా ఉంది. స్లాబ్ నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. వర్షం పడితే ఉరుస్తుండడంతో బాలామృతం వంటి సరుకులు తడిచి ముద్దవుతున్నాయి. కార్యాలయ రికార్డులు భద్రపరచడానికి కార్యకర్త, సహాయకురాలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా మాతమ్మ కొలుపు



ఆలయం వద్ద వయ్యాల కృష్ణారెడ్డి

శ్రీకాళహస్తి: మండలంలోని గుణంజపల్లి ఎస్సీ కాలనీలో మాతమ్మ కొలువును మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మాతమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మాతమ్మ వారిని గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు మాతమ్మకి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దీనికి శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జ్ఞానంబవారి మధు రెడ్డి శ్రీకాళహస్తి పట్టణం యువజన విభాగ అధ్యక్షులు మల్లెంబాకం మునికృష్ణారెడ్డి, ప్రముఖ న్యాయవాది సున్నపు లక్ష్మీపతి రెడ్డి, పుదురు సురేష్ రెడ్డి పాల్గొని మాతమ్మ అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం వీరికి వయ్యాల కృష్ణారెడ్డి దుశ్శాలువతో సత్కరించారు.

సేవతోనే సంతృప్తి



సరుకులు అందజేస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి: సేవతోనే సంతృప్తి లభిస్తుందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ అన్నారు. పట్టణంలోని హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు దివ్యాంగులకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి నెల హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వారు వృద్ధులు, దివ్యాంగులకు క్రమం తప్పకుండా నిత్యావసర సరుకులను అందించడం అభినందనీయమన్నారు.

ఎన్నికల హామీలు సత్యదూరమేనా ?

- సత్యవేడు అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చేదెప్పుడో?
- ఎన్నికల సమయంలో చంద్రబాబు, కోనేటి ఆదిమూలం అలవిగాని హామీలు
- రెండేళ్లు కావస్తున్నా అభివృద్ధి పనులు శూన్యం
- నియోజకవర్గంలో సమస్యల తిష్ట

ఎన్నికల ప్రచారంలో భాగంగా గత ఏడాది ఏప్రిల్ 20న సత్యవేడు గాంధీ బొమ్మ కూడలిలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రస్తుత ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అభ్యర్థన మేరకు సత్యవేడులో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే సత్యవేడు, వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలను మున్సిపాలిటీలుగా అభివృద్ధి చేస్తామన్నారు. అంతేకాకుండా సత్యవేడు, దాసుకుప్పం ప్రాంతాల్లో బైపాస్ రోడ్డు నిర్మిస్తామని మాట ఇచ్చారు. అలాగే ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో ఉన్న సత్యవేడు నియోజకవర్గ ప్రజల ఆరోగ్య అవసరాలకు సత్యవేడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల స్థాయికి అభివృద్ధి చేస్తామన్నారు. దీనికి తోడు నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులో డీఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటై 18 నెలలు అవుతున్నా ఎన్నికల సమయంలో గుప్పించిన హామీలకు దిక్కులేదు.

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర దాటింది. కానీ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు మాత్రం అమలుకు నోచుకోలేదు. ఎంతో వెనుకబడిన సత్యవేడును అభివృద్ధి చేసే బాధ్యత తనదే అంటూ ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఊకదంపుడు హామీలతో నియోజకవర్గ ప్రజలను ఊరడించారు. చంద్రబాబుతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న కోనేటి ఆదిమూలం సైతం ఎన్నికల ప్రచారంలో అలివిగాని హామీలు ఇచ్చారు. వీరి మోసపూరిత హామీలను నమ్మిన ప్రజలు కూటమికి ఓటేశారు.

సమస్యలు ఇవీ..

- నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడు సీహెచ్‌సీని 100 పడకల ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలి.
- సత్యవేడు ఇరుకు రోడ్ల నుంచి మినహాయింపుగా బైపాస్ రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది.
- గత ప్రభుత్వంలో మంజూరైన సత్యవేడు, నాగలాపురం మండలాల పరిధిలోని దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి.
- సత్యవేడులో మాజీ సీఎం వైఎస్సార్ హయాంలో ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలకు పక్కా భవనాలు నిర్మించాలి.
- బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం, కోర్టు భవనం, సబ్ జైలు కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించాలి.
- సత్యవేడు ప్రజల తాగునీటి అవసరాలకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలి
- గత ప్రభుత్వంలో నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రైవేటు పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగాలు కల్పించాలని చేసిన చట్టాన్ని కొనసాగిస్తూ, అదే చట్టాన్ని శ్రీసిటీ పరిశ్రమల్లో అమలు చేయాలి.
- నియోజకవర్గంలోని 7 మండల కేంద్రాల్లో డ్రైనేజీ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలి.
- రైతాంగానికి ఎంతో అవసరమైన తెలుగుగంగ ఉపకాలువలకు ఆధునీకరణ పనులు చేపట్టాలి.
- రైతులకు ప్రధాన వనరు అయిన తాగునీటి చెరువులను అభివృద్ధి చేయాలి.
- ఆరణియార్ ప్రాజెక్ట్ ఆధునీకరణలో భాగంగా గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలి
- నాగలాపురం నుంచి టీపీకోటకు వెళ్లే రోడ్డును, బీఎన్‌కండ్రిగ నుంచి సూళ్లూరుపేటకు వెళ్లే రోడ్డు కూడా డబుల్ రోడ్లుగా మార్చాలి.
- నాడు–నేడులో ఆగిపోయిన ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి.
- నియోజకవర్గంలోని 7 మండలాల్లో గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం ఈఏపీ ద్వారా 36 రోడ్లు గత ప్రభుత్వంలో మంజూరయ్యాయి. అందులో 12 రోడ్ల నిర్మాణం పూర్తవ్వగా మరో 24 రోడ్లు పూర్తి కావాల్సి ఉంది.
- సత్యవేడు–కదూరు కూడలి, సత్యవేడు–ఊత్తుకోట ప్రధాన రోడ్డు మార్గాలు పూర్తిగా గుంతలమయమై వాహన రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ రెండు రోడ్లు అభివృద్ధి చెందాల్సి ఉంది.



ఛిద్రమైన నాగలాపురం - టీపీకోట రోడ్డు మార్గం







సత్యవేడు టవర్ క్లాక్, బ్రిటీష్ కాలం నాటి తహసీల్దార్ కార్యాలయం, సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్

సర్పంచ్ లేకుండా గ్రామసభ నిర్వహణ

రేణిగుంట: మండలంలోని విప్పమాని పట్టెడ పంచాయతీ కార్యాలయంలో ఈనెల 4వ తేదీన సర్పంచ్ లేకుండా టీడీపీ కార్యకర్త అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించడంపై సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న సుబ్బారెడ్డి పంచాయతీ రాజ్ చట్టాన్ని సైతం లెక్క చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. మండల, జిల్లా స్థాయి అధికారులు విచారించి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డిని వివరణ కోరగా సర్పంచ్‌కు ఫోన్ చేశానని ఆయన స్పందించలేదని తెలిపారు. ఎంపీడీవో రవిచంద్ర వివరణ ఇస్తూ గ్రామసభను సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించాలని అన్నారు. ఆ పంచాయతీలో జరిగిన విషయంపై విచారణ చేసి పూర్తి వివరాలు తెలుసుకుంటామని తెలిపారు.

చౌడేశ్వరి అమ్మవారికి పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

వరదయ్యపాళెం: మండలంలోని బీఎస్‌పేట గ్రామంలో రామలింగ చౌడేశ్వరి అమ్మవారికి వైభవంగా పూజలు చేపట్టారు. దేవాంగుల కులదేవతగా పూజించే రామలింగ చౌడేశ్వరి అమ్మవారిని ఆదివారం తెల్లవారుజామున గ్రామంలో కొలువుదీర్చారు. మధ్యాహ్నం మహానైవేద్యం పూజ చేపట్టారు. గ్రామంలో 35 సంవత్సరాల తర్వాత అట్టహాసంగా చౌడేశ్వరి అమ్మవారి పూజలు వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు మాచర్ల చెంచయ్య శెట్టి, కృష్ణయ్య శెట్టి, వీరభద్రం, కరుణాకర్, గూడలి సుధాకర్, దామోదరం, బొప్పన శివయ్య శెట్టి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

చరణ్‌సాయికి భూమన ఆశీస్సులు



చరణ్‌సాయిని ఆశీర్వదిస్తున్న భూమన కరుణాకర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ దంపతుల కుమారుడు ఉన్నం చెంచు చరణ్ సాయి 'పంచకట్టు వేడుక' సందర్భంగా మంగళ స్నానాలు, నలుగు కార్యక్రమాలు నిర్వహించారు. దీనికి వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఉన్నం చెంచు చరణ్ సాయిని ఆశీర్వదించారు.

లైసెన్స్‌దారులే టపాసులు అమ్మాలి



టపాసుల విక్రయదారులతో మాట్లాడుతున్న సీఐ తిమ్మయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన లైసెన్స్‌దారులు మాత్రమే టపాసులను అమ్మాలని, లైసెన్స్ లేనివారు టపాసుల అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని బుచ్చినాయుడుకండ్రిగ సీఐ తిమ్మయ్య తెలిపారు. ఆయన ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగలో టపాసులు విక్రయదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా విక్రయదారులు నిబంధనలను విధిగా పాటించాలని, ప్రతి దుకాణం వద్ద రెండు అగ్ని నిరోధక సిలిండర్లు, రెండు బకెట్ల పొడి ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఫైర్ అలారమ్ సిస్టమ్ ఏర్పాటుతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. అధికారులు అనుమతించిన ప్రదేశాల్లోనే విక్రయ, నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



చెంచు మునెయ్యకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితుడు పవన్‌కుమార్ తండ్రి చెంచు మునెయ్య శనివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఉదయం పవన్‌కుమార్ స్వగృహానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పవన్‌కుమార్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ముక్కంటి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సురేష్, శరవణకుమార్, కంఠా ఉదయ్‌కుమార్, పులి రామచంద్ర, మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్, ప్రకాశం పంతులు, జీవీకే రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

పేదల పక్షాన సీపీఐ



బస్టాండ్ ఆవరణలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న హరినాథరెడ్డి

వరదయ్యపాళెం: దేశంలో ఆకలి, దారిద్ర్యం లేని సమసమాజ స్థాపనకు సీపీఐ అహర్నిశలు కృషి చేయడంతో పాటు పేదల పక్షాన నిలబడి పోరాడే జెండా ఎర్రజెండా ఒకటేనని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథరెడ్డి తెలిపారు. సోమవారం నుంచి వారం రోజుల పాటు వరదయ్యపాళెంలో జరిగే సీపీఐ శత వసంతాల వేడుకల్లో భాగంగా ఆదివారం ఆ పార్టీ శ్రేణులు శత వసంతాల వేడుకలు విజయవంతం కోసం వరదయ్యపాళెం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో నేటికీ పేదవాడికి ఇంటి స్థలం లేకపోవడం బాధాకరమన్నారు. వరదయ్యపాళెంలోని క్యాంపస్–4లో జరిగే సీపీఐ శత వసంతాల వేడుకలు విజయవంతానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నిరాజ్, చిన్నం పెంచలయ్య, కత్తి రవి, నాయకులు ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తపాలా వారోత్సవాలు

- 11 వరకు ప్రత్యేక క్యాంపులు

శ్రీకాళహస్తి: జాతీయ తపాలా వారోత్సవాలు సోమవారం నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఐపీఓ బాలాజీ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలోని తపాలా కార్యాలయాల్లో ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక క్యాంపుల ద్వారా వివిధ సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. వారోత్సవాల సందర్భంగా పొదుపు పథకాల ఓపెనింగ్, ఇన్సూరెన్స్ పాలసీలు, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతాలు ప్రారంభంపై క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తపాలా పొదుపు పథకాలపై వడ్డీ శాతాలను తెలిపారు. ఎస్‌బీ (సేవింగ్స్ బ్యాంక్)పై 4%, ఎంఐఎస్ (మంత్లీ ఇన్‌కమ్ స్కీం) పై 7.4%, టీడీ (టైం డిపాజిట్)పై సంవత్సరం కాల పరిమితికి 6.9%, రెండేళ్లకు 7%, మూడేళ్లకు 7.1%, ఐదేళ్లకు 7.5% వడ్డీ ఉంటుందని వెల్లడించారు. ఆర్‌డీ (రికరింగ్ డిపాజిట్)పై 6.7%, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ కింద 8.2%, ఎస్‌ఎస్‌ఏ (సుకన్య సమృద్ధి యోజన)పై 8.2%, కిసాన్ వికాస్ మిత్ర కింద 7.5%, ఎన్‌ఎస్‌సీ (నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్) పై 7.7%, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌పై 71% వడ్డీ ఉంటుందని వివరించారు. తపాలా కార్యాలయాల్లో నూతన సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు, 2.0 టెక్నాలజీ వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. ఓటీసీ ఆధారిత డెలివరీ విధానం ద్వారా ఇంటి నుంచే వివిధ వస్తువులను బుక్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అలాగే ఇన్సూరెన్స్ పాలసీలపై జీఎస్టీ రద్దు చేసినట్లు చెప్పారు. వారోత్సవాల సందర్భంగా తపాలాశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐపీఓ బాలాజీ కోరారు.

ఏర్పేడులో తాగునీటి సమస్యకు పరిష్కారం

ఏర్పేడు: స్థానిక పంచాయతీ గాండ్ల వీధిలో వారం రోజులుగా తాగునీటి సమస్య ఏర్పడడంతో ఆదివారం తాగునీటి బోరును డ్రిల్లింగ్ చేశారు. ఏర్పేడు చెరువు కలుజు కాల్వ మరమ్మతు పనులు చేపడుతుండగా, జేసీబీ ఆపరేటర్లు గాండ్లవీధికి వెళ్లే తాగునీటి పైపులైన్‌ను తవ్వేయడంతో పైపులైను దెబ్బతిని, మరుగునీళ్లు కలిసిపోయాయి. దీంతో వారం రోజులుగా గాండ్లవీధికి తాగునీరు అందటం లేదు. దీంతో స్పందించిన యంత్రాంగం ఆదివారం బోరు డ్రిల్లింగ్ పనులు చేపట్టారు.

ముక్కంటి సేవలో సినీనటుడు సుమన్



ఆలయం వద్ద సుమన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ప్రముఖ సినీనటుడు సుమన్ దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆయనను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన హజ్రత్ జుంలేషాపీర్ దర్గాను దర్శించుకున్నారు. దర్గా ఉరుసు కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

ఘనంగా పుట్టాలమ్మ పొంగళ్ల మహోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: మండలంలోని తొండమానపురం సమీపంలో ఉన్న పుట్టాలమ్మ ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా పొంగళ్ల మహోత్సవం నిర్వహించారు. తొండమానుపురం, ఎగువవీధి, దిగువవీధి, రామలింగాపురం తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు ఉదయం నుంచే ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారిని గ్రామవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.

ముక్కంటి సేవలో కర్ణాటక హైకోర్టు జడ్జి



ఆలయం వద్ద జస్టిస్ గీతా కదాబ భారత రాజా సెట్టర్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం కర్ణాటక హైకోర్టు జడ్జి గీతా కదాబ భారత రాజా సెట్టర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా సిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో పూజలు చేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్‌డీకే నగర్‌లోని నాగాలమ్మవీధిలో ఆదివారం శ్రీసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ పూజలకు శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. ఆయనకు కమిటీ సభ్యులకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. హోమపూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు ఆయన్ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలిశెట్టి నరసింహులు, అమర్‌నాథ్, వేలు, చిరంజీవి, రజనీకుమార్, మాధవ, వెంకటేష్, రమణయ్య, మోహన్‌కుమార్, బాల, చిరంజీవి, భాస్కర్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గ్రామోత్సవం



గ్రామోత్సవంలో దుర్గాదేవి అమ్మవారు

సత్యవేడు: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం సాయంత్రం సత్యవేడులో దుర్గా దేవి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. విజయదశమి సందర్భంగా సర్వమంగళాదేవి ఆలయంలో ప్రత్యేకంగా కొలువుదీర్చిన కనకదుర్గా మాతకు నవరాత్రుల సందర్భంగా వివిధ రూపాల్లో కొలువుదీర్చి పూజలు చేపట్టారు. ఉత్సవాలు ముగియడంతో ఆదివారం గ్రామంలో అమ్మవారి ఊరేగింపు గాంధీ రోడ్డు, నేతాజీ రోడ్డు, పల్లావు వీధి, కృష్ణయ్యశెట్టి వీధి, గంగమ్మ వీధుల్లో ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పసుపు నీటి కలశాలను తలపై ఉంచుకుని అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదర్శన చేశారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు.

త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కదూరు సహకార సంఘం త్రిసభ్య కమిటీ సభ్యులు

వరదయ్యపాళెం: మండలంలోని కదూరు సహకార సంఘానికి ఇటీవల ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నామినేట్ చేసింది. ఆ మేరకు అంబూరుకు చెందిన ఎన్ఆర్ఐ ఆణిముత్యం నందకిషోర్ రెడ్డి చైర్మన్‌గా, సభ్యులుగా సీఎల్ఎన్‌పల్లికి చెందిన రవిరెడ్డి, నెల్లటూరుకు చెందిన రమేష్ యాదవ్‌ను నియమించడంతో ఆదివారం వారు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వరదయ్యపాళెంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి మాట్లాడుతూ.. సహకార సంఘం ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, మండల టీడీపీ అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, రాష్ట్ర తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి శ్రీరామనేని పవన్ కుమార్, మాజీ ఎంపీపీలు మస్తాన్ యాదవ్, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.